క్లుప్తంగా

అద్దె చెల్లించని దుకాణాలకు తాళాలు



మున్సిపల్ కాంప్లెక్స్‌లో దుకాణాలకు తాళాలు వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని ఎన్‌టీఆర్ మున్సిపల్ కాంప్లెక్స్‌లో గల మడిగెలకు అద్దె బకాయిలు భారీగా పెరుకుపోవడంతో మంగళవారం మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ ఆదేశాల మేరకు దుకాణాలకు తాళాలు వేశారు. ఈ నాలుగు దుకాణాల నుంచి రూ.4లక్షల 4వేల 107 వరకు బకాయి ఉన్నట్లు అధికారులు తెలిపారు. తాళాలు వేసిన వారిలో ఆర్‌ఓ జ్ఞానేశ్వరీ, ఆర్‌ఐ సాజి, జూనియర్ అసిస్టెంట్ మాజీద్, బిల్ కలెక్టర్ వేముల శ్రీనివాస్ తదితరులున్నారు.

పశువులకు సకాలంలో చికిత్స చేయించాలి

త్రిపురారం : పశువులకు వచ్చే వ్యాధుల పట్ల పాడి రైతులు నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో చికిత్స చేయించాలని ప్రిన్సిపల్ సైంటిస్ట్ అండ్ ఇన్‌వెస్టిగేటర్ డాక్టర్ సుచిత్ర సేన అన్నారు. మంగళవారం త్రిపురారం మండలంలోని పలు గ్రామాల్లో ఐసీఏఆర్ డైరెక్టరేట్ ఆఫ్ పౌల్ట్రీ రిసెర్చ్ రాజేంద్రనగర్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో పాడి పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు, పందుల్లో సూక్ష్మ జీవుల నిరోధక శక్తిని తెలుసుకునేందుకు వైద్య సిబ్బందితో కలిసి నమూనాలు సేకరించారు. పలు పశువులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయంతో పాటు పశుపోషణ చేపడితే నిత్య ఆదాయం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో త్రిపురారం మండల పశు వైద్యాధికారి డాక్టర్ నాగేందర్, రాహుల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న గోవుల పట్టివేత

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండలం చింతచెట్టుతండా గ్రామ పరిధిలోని జేత్యతండా నుంచి మంగళవారం తెల్లవారు జామున బొలెరో వాహనంలో 10 గోవులను హైదరాబాద్‌కు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపిన ప్రకారం.. గోవులను అక్రమంగా తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు కొండమల్లేపల్లి పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. అయితే బొలెరో వాహనంలో 10 గోవులను హైదరాబాద్‌కు తరలిస్తుండగా కొండమల్లేపల్లి చౌరస్తా వద్ద పోలీసులు పట్టుకున్నారు. బొలెరో వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి, గోవులను వెల్దండ గోశాలకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రభుత్వ భూములకు ఫెన్సింగ్ ఏర్పాటు



ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ ఏర్పాటు చేయిస్తున్న తహసీల్దార్ హరిబాబు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణంలోని అద్దంకి- నార్కట్‌పల్లి ప్రధాన రహదారి నుంచి చింతపల్లి వెళ్లే రోడ్డులో గల 626 సర్వే నంబర్‌లో గల 4.06 ఎకరాల ప్రభుత్వ భూమి చుట్టూ మంగళవారం మండల తహసీల్దార్ హరిబాబు హద్దు రాళ్లు, ఫెన్సింగ్ ఏర్పాటు చేయించారు. అదేవిధంగా సర్వే నంబరు 1లో గల 440 స్క్వేర్ యార్డు భూమి చుట్టూ కూడా ఫెన్సింగ్ ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ భూములను గుర్తించి హద్దులు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. ఆయన వెంట ఆర్‌ఐలు భాణావత్ సత్యనారాయణ, రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

కూరాకుల లింగయ్య మృతికి సంతాపం



కూరాకుల లింగయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

హాలియా : బీఆర్‌ఎస్ అనుముల మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు తండ్రి కూరాకుల లింగయ్య సోమవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ మంగళవారం మండలంలోని రామడుగు గ్రామంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కూరాకుల లింగయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో మాజీ ఎంపీపీలు సుమతిపురుషోత్తం, నాగమణిపెద్దిరాజు, బీఆర్‌ఎస్ నాయకులు సంపత్‌కుమార్, వివిధ మండలాల అధ్యక్షులు నాగయ్య, సత్యపాల్, రవినాయక్, జిల్లా మైనార్టీ నాయకులు షేక్ అబ్దుల్ హలీం, నల్లగొండ సుధాకర్, కృష్ణ యాదవ్, సైదాచారి మాజీ సర్పంచ్ వెంకటరమణారెడ్డి, రామయ్య, యాదయ్య,సైదులు తదితరులు ఉన్నారు.

జాతరకు పోటెత్తిన భక్తజనం

వైభవంగా సుంకిశాల ముత్యాలమ్మ జాతర

- గిరిజన సంప్రదాయాలతో పూజలు
- ఆకర్షణగా నిలిచిన ప్రభలు
- భారీగా పోలీస్ బందోబస్తు



సుంకిశాల ముత్యాలమ్మ జాతరలో పూజలు చేస్తున్న భక్తులు

పెద్దవూర : మండలంలోని రామన్నగూడెం తండా వద్ద మంగళవారం జరిగిన సుంకిశాల ముత్యాలమ్మ జాతరకు మంగళవారం భక్తులు పోటెత్తారు. రెండేళ్లకొకసారి మాఘ శుద్ధ చైత్ర పౌర్ణమి తర్వాత వచ్చే మంగళవారం రోజు ఇక్కడ జాతర నిర్వహించడం ఆనవాయితీ. జిల్లాలోనే అతిపెద్ద జాతరగా ఇది ప్రసిద్ధి. అయితే ముత్యాలమ్మ దేవతను గిరిజనులు ఆరాధ్య దైవంగా భావిస్తున్నా కుల, మతాలకతీతంగా అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకుంటున్నారు. జాతరలో భాగంగా గిరిజన సంస్కృతి, సంప్రదాయాలతో గిరిజనులు డప్పువాయిద్యాల నడుమ నృత్యాలు చేస్తూ కటార్లతో తమ తండాల నుంచి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారికి బోనాలు, నూతన వస్త్రాలు సమర్పించారు. యాటలు, కోళ్లను బలి ఇచ్చారు. ఆలయ ప్రధాన పూజారి రమావత్ లచ్చీరాంనాయక్, ఆలయ కమిటీ చైర్మన్ రమావత్ మోహన్‌నాయక్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిపారు. జాతరకు లక్ష మందికి పైగా భక్తులు హాజరైనట్లు, మరో రెండు మంగళవారాలు జాతరకు భక్తులు రానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రత్యేక ఆకర్షణగా ప్రభలు..

ముత్యాలమ్మ జాతరలో భాగంగా భక్తులు ట్రాక్టర్లపై ప్రభలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. డప్పు చప్పుళ్ల నడుమ గిరిజన సంప్రదాయాల ప్రకారం మహిళల నృత్యాలు చేస్తూ ప్రభలతో ఆలయం వద్దకు చేరుకున్నారు. పదుల సంఖ్యలో ప్రభలను ఆలయ పరిసరాల్లో ఉంచటంతో అవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

భారీ బందోబస్తు..

ముత్యాలమ్మ ఆలయం నాగార్జునసాగర్- హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఉండటంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. హాలియా, నాగార్జునసాగర్, మిర్యాలగూడ సర్కిల్‌ల నుంచి ఇద్దరు సీఐలు, ఐదుగురు ఎస్‌ఐలతో పాటు 60 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. నాగార్జునసాగర్ సీఐ బీషన్న, పెద్దవూర ఎస్‌ఐ వీరబాబు బందోబస్తును పర్యవేక్షించారు.

పట్టు వస్త్రాలు సమర్పించిన లింగారెడ్డి..

సుంకిశాల ముత్యాలమ్మ అమ్మవారికి జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, మాజీ జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి నూతన పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి, మోహన్‌నాయక్, నాగేశ్వర్‌రావు, బాసు, మునిలాల్, ఉంగరాల శ్రీను, వెంకటయ్య, దండ మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న లింగారెడ్డి



క్యూలో నిల్చున్న భక్తులు



బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటా

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



గూడూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : మిర్యాలగూడ నియోజకవర్గంలోని ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని ఐలాపురం, తుంగపాడు, జప్తి వీరప్పగూడెం, గూడూరుతోపాటు పలు గ్రామాల్లో నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేసే ప్రతి కార్యకర్తను గుర్తించి వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యకర్తల సమస్యలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు చట్టబద్ధత లేదనడం సరికాదు

- మాజీ ఎమ్మెల్యే నోముల భగత్



మాట్లాడుతున్న నోముల భగత్

హాలియా : కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వేకు చట్టబద్ధత ఉందని, బీఆర్‌ఎస్ హయాంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు చట్టబద్ధత లేదని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడడం సరికాదని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. మంగళవారం పట్టణంలోని తన నివాసంలో పార్టీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కుల గణన చేసిన అధికారులే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సమగ్ర కుటుంబ సర్వే చేశారనే విషయాన్ని గుత్తా సుఖేందర్‌రెడ్డి మరిచారని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న అన్ని బీసీలు, వెనుకబడిన వర్గాలు, సంఘాల నాయకులు కులగణన అంత అస్తవ్యస్తంగా ఉందని పారదర్శకంగా లేదని ఓవైపు గగ్గోలు పెట్టి చెబుతుంటే గుత్తా సుఖేందర్‌రెడ్డి మాత్రం ఈ సర్వేకు చట్టబద్ధత ఉందని చెప్పడం సమంజసం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ కుల జనాభాను తగ్గించి ఓసీ జనాభాను పెంచారని, 2014లో 51శాతం ఉన్న బీసీలు 46శాతానికి ఎలా తగ్గారో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. అనంతరం ఆయన నియోజకవర్గంలోని బూత్ కమిటీ సభ్యులకు డైరీ, క్యాలెండర్లను అందజేశారు. సమావేశంలోపార్టీ నాయకులు జవ్వాజి వెంకటేశ్వర్లు, బొల్లం రవి, జటావత్ రవినాయక్, వడ్డె సతీష్‌రెడ్డి, నల్లగొండ సుధాకర్, పామోజు వెంకటాచారి, బొల్లం సైదులు, సురభి రాంబాబు, కాట్నం నాగరాజు గౌడ్, రవి నాయక్, శ్రీకర్ నాయక్, ఉపేందర్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్



పూజల్లో పాల్గొన్న రవీంద్రకుమార్

కొండమల్లేపల్లి : ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని చెన్నారం గ్రామంలో గల చెన్నకేశవస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరూ చెన్నకేశవ స్వామి అనుగ్రహం పొందాలన్నారు. అనంతరం ఆయనను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వడ్త్య రమేష్, మండల అధ్యక్షుడు రమావత్ దస్రూనాయక్, తులసిరాం, రమావత్ శ్రీనునాయక్, సత్యం, వడ్త్య బాలు, లాలునాయక్, వెంకటేష్ పాల్గొన్నారు.

నేడు తిరుమలనాథస్వామి కల్యాణం

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండలంలోని రంగుండ్ల పరిధిలో గల అలివేలు మంగమ్మ సమేత తిరుమలనాథ స్వామి కల్యాణాన్ని బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ప్రతి యేటా మాఘశుద్ధ పౌర్ణమి రోజున స్వామి అమ్మవార్లకు కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

కార్యక్రమాలు ఇలా..

బుధవారం ఉదయం 7.15గంటలకు గణపతి పూజ, స్వస్తివచనం, అఖండ దీపారాధన, ఆదిత్యనవగ్రహ, ఇంద్రాద్రి, అష్టదిక్పాలక పూజ, సర్వదేవతా ఆహ్వానం, ఉదయం 8.15గంటలకు ఆంజనేయస్వామి సింధూర పూజ, 8.45కు స్వామి అమ్మవార్లకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, అష్టోత్తర, సర్వదర్శనం, 11.59గంటలకు స్వామి అమ్మవార్ల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాము

"కల్యాణానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేశాము. స్వామి వారి ఆలయం పురాతనమైనది కావడంతో భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. కొండపైకి వెళ్లడానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాం.
– కల్లూరి వెంకటేశ్వర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్

మూడు రాష్ట్రాల స్థాయి ఎద్దుల పందేలు

ఆలయ కమిటీ ఈ ఏడాది కూడా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల స్థాయి ఎడ్ల పందేలను నిర్వహించనుంది. ప్రథమ బహుమతి రూ.80వేలు, ద్వితీయ రూ.60వేలు, తృతీయ రూ.40వేలు, నాలుగో బహుమతి రూ.30వేలు, ఐదో రూ.25వేలు, ఆరు రూ.20వేల నగదు అందించనున్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను రీజినల్ కోఆర్డినేటర్ స్వప్న మంగళవారం తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని సోమవారం ఓ దిన పత్రికలో కథనం ప్రచురితం కావడంతో విచారణ నిమిత్తం ఆమె పరిశీలనకు వచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మల్లీశ్వరితో పాటు సిబ్బంది, విద్యార్థుల నుంచి వేర్వేరుగా వివరాలు సేకరించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

చింతపల్లి : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మంగళవారం సమాచార హక్కు చట్టం ప్రచార సమితి క్యాలెండర్‌ను తహసీల్దార్ రమాకాంత్‌శర్మ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ హర్షత్, ఆర్‌ఐ సునీత, సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాట్రావత్ రాజునాయక్, జిల్లా కార్యదర్శి ఏనుగుల వెంకటేష్, చిట్టి మళ్ల సురేష్, గంటా జగదీష్, నాగార్జున, మధు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం



కబడ్డీ క్రీడలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ

మిర్యాలగూడ : మండలంలోని చిల్లాపురం గ్రామంలో శ్రీసీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ సాతునూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామీణ స్థాయి కబడ్డీ పోటీలను మంగళవారం మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో గ్రామాల మధ్య స్నేహసంబంధాలు మెరుగవుతాయని అన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. అనంతరం మోదాల శ్రీనివాస్‌రెడ్డి జ్ఞాపకార్థంగా తల్లిదండ్రులు మోదాల చినమల్లయ్య -పద్మ దంపతులు క్రీడాకారులకు క్రీడా దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో కోట్ల శ్రీనివాస్‌రెడ్డి, జానపద శ్రీనివాస్, మల్లికంటి రేణుబాబు, కంచనపల్లి శ్రీనివాస్, బొడ్డుపల్లి లక్ష్మీనారాయణ, మోత్కూరు సైదాచారి, మల్లికంటి వెంకటేశ్వర్లు, సైదులు, లింగారెడ్డి, సతీష్, ప్రతాప్‌రెడ్డి, కోటిరెడ్డి, మల్లయ్య, రాము, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

సంత్‌సేవాలాల్ జయంతిని జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

మిర్యాలగూడ: మిర్యాలగూడలో ఈనెల 15న నిర్వహించే సంత్‌సేవాలాల్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ అన్నారు. మంగళవారం మిర్యాలగూడలోని తన కార్యాలయంలో బంజారా సంఘం నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మిర్యాలగూడ ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఎన్‌ఎస్‌పీ క్యాంప్‌లోని బంజారా భవన్ వరకు జరిగే ర్యాలీలో బంజారా సంఘం నాయకులు, బంజారా ఉపాధ్యాయులు, ఉద్యోగులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అనంతరం భోగ్‌బండార్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో తహసీల్దార్ హరిబాబు, ఎంఈఓ బాలాజీనాయక్, బంజారా ఉద్యోగుల సంఘం నాయకులు మాలోతు దశరథ్‌నాయక్, తిరుపతి, భాష్యానాయక్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించే వరకు పోరాడుతాం



అభివాదం చేస్తున్న నాయకులు

తిరుమలగిరి : విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేంత వరకు విద్యార్థుల పక్షాన పోరాడుతామని ఎస్‌ఎఫ్‌ఐ నాగార్జునసాగర్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లవెల్లి జగదీష్, కోరె రమేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు అందాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుండా ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని విమర్శించారు. మండల కేంద్రంలో ఉన్న కేజీబీవీ అద్దె భవనంలో కొనసాగుతుండటంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా త్వరితగతిన భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరారు. బాలుర బీసీ హాస్టల్‌కు ఇప్పటికీ సొంత భవనం లేక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ నెల 19, 20వ తేదీలలో నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించే జిల్లా సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు వేములకొండ పుల్లయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జటావత్ రవి, చాంద్‌పాషా, వర్షిత్, అంజి, శివ పాల్గొన్నారు.

బస్సెక్కండి.. బహుమతి పొందండి



బహుమతులు అందజేస్తున్న అసిస్టెంట్ డిపో మేనేజన్ భారతీబాయి

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ నుంచి విజయవాడకు డీలక్స్ బస్సులను ఎక్కి బహుమతులు పొందాలని మిర్యాలగూడ ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ భారతీబాయి అన్నారు. డిపో నుంచి విజయవాడకు వెళ్లిన ప్రమాణికులకు సంబంధించి గిఫ్ట్ బాక్స్‌లో వేసిన టికెట్లకు లక్కీ డ్రా తీసి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. డిపో నుంచి విజయవాడకు డిలక్స్ బస్సులో ప్రయాణించే మహిళలు తమ టికెట్ వెనుక తమ పేరు, ఫోన్ నంబర్ రాసి డ్రైవర్ వెనుక భాగంలో ఉన్న గిఫ్ట్ బాక్స్‌లో వేయాలని సూచించారు. వాటికి 15 రోజుల తరువాత లక్కీ డ్రా తీసి గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామని తెలిపారు. మంగళవారం నిర్వహించిన లక్కీ డ్రాలో మొదటి బహుమతి యాదమ్మ(మిర్యాలగూడ), ద్వితీయ బహుమతి శివలీల(కోదాడ), తృతీయ బహుమతి ఎం. సునీత (హుజూర్‌నగర్) గెలుచుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎఫ్ యాదగిరి, జి. యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి జాతర

కొండమల్లేపల్లి : మండలంలోని చెన్నారం గ్రామంలో ప్రతి ఏడాది మాఘమాసం సందర్భంగా నిర్వహించే శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారిని తేరులో కూర్చొబెట్టి ఊరేగింపు చేపట్టారు. అనంతరం భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు కబీర్‌ఖాన్, లాలునాయక్, శంకాచారి, పూజారి శివయ్య శర్మ పాల్గొన్నారు.

బూటకపు సర్వేను నమ్మొద్దు

మిర్యాలగూడ టౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన కులగణన బూటకపు సర్వేను ప్రజలు నమ్మొద్దని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులుగౌడ్ ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో బీసీల జనాభా 60శాతం వరకు ఉంటే కాంగ్రెస్ నిర్వహించిన కులగణనలో బీసీలను 46శాతం మేరకు చూపించడం విడ్డురంగా ఉందన్నారు. బీసీలను సీఎం రేవంత్‌రెడ్డి ఏ విధంగా అణిచివేస్తున్నాడో ఈ సర్వేతో బయటపడిందన్నారు. అగ్రకులాల వారిని రెట్టింపు చేసి బీసీ, ఎస్సీ, ఎస్టీల సంఖ్యను తగ్గించి చూపించడం హేయమైన చర్య అన్నారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ, సురేష్ తదితరులున్నారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు ఘన నివాళి



దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

దేవరకొండ : భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, భారతీయ జనతా పార్టీకి పునాదులు వేసిన దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని మంగళవారం దేవరకొండ పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి సురేష్ మాట్లాడుతూ.. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గొప్ప మానవతావాద సిద్ధాంతకర్త అని అన్నారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరం



పాములపాడులో నిర్వహించిన వైద్యశిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

వేములపల్లి : ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్, ఇమ్మానియేల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జవ్వాజీ ఆనంద్‌కుమార్, జవ్వాజీ జెస్సీకుమార్‌లు మాడ్గులపల్లి మండలంలోని పాములపాడు గ్రామంలో మంగళవారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ క్యాంప్ లీడర్ జంగా జయరాజు, జవ్వాజీ జెస్సీకుమార్, జవ్వాజీ ఆనంద్ కుమార్‌లు మాట్లాడారు. శిబిరంలో 350 మందికి ఉచితంగా రక్త, బీపీ, షుగర్, ఎక్స్‌రే, ఈసీజీ, కంటి పరీక్షలు నిర్వహించి మందులను, అద్దాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా పరీక్షలకు హాజరైన 400 మందికి దుప్పట్లు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు చందన, భరత్, భక్తసింగ్, వినీత, సంపత్, సిబ్బంది కుసుమ, స్వామి, సమూయేల్, నరసింహ, రవి, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన



మాట్లాడుతున్న సీడీపీఓ రేఖల మమత

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ అర్బన్ ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీఓ రేఖల మమత మంగళవారం పరిశీలించారు. అనంతరం స్థానిక చాంబర్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పట్టణంలో 100అంగన్‌వాడీ కేంద్రాలు, మిర్యాలగూడ మండలంలో 111అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా అర్బన్, రూరల్ పరిధిలో 34 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయన్నారు. ఇటీవల సంగారెడ్డి జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రంలో భవనం పెచ్చులు ఊడి పిల్లలపై పడిన సంఘటన పునరావృతం కాకుండా ఉండేందుకు పీడీ కృష్ణవేణి ఆదేశాల మేరకు పరిశీలించినట్లు తెలిపారు. ప్రాజెక్టు పరిధిలోని సొంత భవనాలలో 32వరకు అక్కడక్కడ పెచ్చులు ఉండి చిన్నచిన్న మరమ్మతులు ఉండగా రెండు మాత్రమే స్లాబ్ పెచ్చులు ఉండి ఉండడంతో వాటిని వెంటనే మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మ, నజీమాబేగం, వాణి, లీలాకుమారీ, రాధిక తదితరులున్నారు.

సర్వేలో బీసీలకు అన్యాయం

త్రిపురారం : ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో బీసీలకు తీవ్రంగా అన్యాయం జరిగిందని బీసీ సంఘం నాగార్జున సాగర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పిల్లి రాజు యాదవ్ అన్నారు. మంగళవారం బీసీ సంఘం సభ్యులతో కలిసి నిడమనూరు మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేవలం 7 శాతం జనాభా ఉన్న ఓసీలకు 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పించి, బీసీ జనాభాను తక్కువ చేసి చూపడం దారుణమన్నారు. స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు దక్కే విధంగా అసెంబ్లీలో బిల్లు పెట్టాలని కోరారు.

ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వండి

మిర్యాలగూడ: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి సుందర్‌రాజు మంగళవారం మిర్యాలగూడ పట్టణంలో పలువురు ఉపాధ్యాయులను కలిసి ఓట్లు అభ్యర్థించి మాట్లాడారు. సీపీఎస్ స్థానంలో ఓపీఎస్‌ను అమలు చేయాలని వేడుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఉపాధ్యాయ సంఘాలు 317జీవోను వ్యతిరేకించకపోవడం బాధాకరమన్నారు. ఉద్యమ నేపథ్యం నుంచి వచ్చిన తనకు ఎమ్మెల్సీగా ఒక్క అవకాశం కల్పించాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

ఆయన వెంట పంకజ్‌యాదవ్, అంబర్ల సత్యనారాయణ, కట్టెబోయిన శ్రీనివాస్ ఉన్నారు.

పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడిగా పున్న లింగమయ్య

డిండి : పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడిగా పున్న లింగమయ్య నియమితులయ్యారు. మంగళవారం దేవరకొండలో జరిగిన పద్మశాలి సంఘం సర్వసభ్య సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పొట్టబత్తుల సత్యనారాయణ చేతుల మీదుగా ఆయన నియామకపత్రం అందుకున్నారు. తన ఎన్నికకు సహకరించిన వారందరికీ లింగమయ్య ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదకరంగా స్టేవైర్

డిండి : మండల కేంద్రం నుంచి దేవరకొండ వెళ్లే రోడ్డులో డిండి విత్తనోత్పత్తి కేంద్రం సమీపంలో రోడ్డు వెంట విద్యుత్ స్తంభాలకు సపోర్ట్‌గా ఏర్పాటు చేసిన స్టేవైర్ ప్రమాదకరంగా ఉంది. దారికి అడ్డుగా ఉండడంతో ఈ మార్గం గుండా నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

త్రిపురారం : నిడమనూరు మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన సలికంటి సత్యం తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం ముకుందాపురంలో మృతుడి కుటుంబసభ్యులను యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఎడవెల్లి వల్లభరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం, కొండా శ్రీనివాస్‌రెడ్డి, మంజుల శ్రీనివాస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పైపు లైన్ నిర్మాణానికి భూముల సర్వే

అడవిదేవుపల్లి : మండలంలోని చిట్యాల గ్రామ సమీపంలో దున్నపోతుల గండి నిర్మాణంలో భాగంగా చిట్యాల గ్రామం నుంచి దున్నపోతుల గండి వరకు 8 కిలో మీటర్ల మేర పైపులైన్ నిర్మాణం చేపట్టనున్నారు. ఇందులో భాగంగా మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు కొత్తనందికొండ, బాల్నేపల్లి, చిట్యాల, అడవిదేవులపల్లిలో పైప్‌లైన్ నిర్మాణానికి రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు మంగళవారం రైతుల భూములను సర్వే చేశారు. సర్వేలో మండల సర్వేయర్,డీఈఈ,రైతులు ఉన్నారు.